
అమ్మవారి పూజల్లో పాల్గొన్న మణికొండ శివాజీనగర్‌వాసులు


నార్సింగి అక్యూరేట్ విండ్ చిమ్నీస్ గేటెడ్ కమ్యూనిటీలో..


నార్సింగి గ్రామంలో బతుకమ్మలను పేర్చిన మహిళలు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- వాడవాడలా వెలసిన అమ్మవారు
- నయనానందకరంగా మండపాల ఏర్పాటు
- ప్రత్యేక పూజలు.. దాండియా నృత్యాలు
- బతుకమ్మ ఆడితూ సందడి చేస్తున్న మహిళలు

రాజేంద్రనగర్ జోన్ బృందం: దసరా నవరాత్రి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాజేంద్రనగర్ నియోజక వర్గం పరిధిలోని రాజేంద్రనగర్, మణికొండ, నార్సింగి, మైలార్‌దేవ్‌పల్లి, బండ్లగూడ జాగీర్, శంషాబాద్, అత్తాపూర్ తదితర ప్రాంతాల్లో వాడవాడలా అమ్మవారి మండపాలను ఏర్పాటు చేశారు. వాటిలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీల పరిధిలోని పలు గ్రామాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలలో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. మండపాలను అందంగా తీర్చిదిద్ది మొదటి రోజు సోమవారం వేదమంత్రోచ్ఛరణలతో అమ్మవారి ప్రతిమలకు పూజలు చేశారు. మండపాల వద్ద బతుకమ్మలు, దాండియా ఆటలతో సందడి చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, అన్నదానాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.

బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు

శంషాబాద్ పట్టణంలోని శృంగేరీ దేవాలయం, నాగలింగేశ్వరాలయంతో పాటు ధర్మగిరి దేవాలయంలో అమ్మవారిని బాలా త్రిపురసుందరిగా అలంకరించారు. ఈ సందర్భంగా నిత్యం హోమం, పారాయణం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.


శంషాబాద్ ధర్మగిరిలో బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు


త్రిపుర సుందరి దేవిగా బుద్వేల్ కోట మైసమ్మ అమ్మవారు


హైదర్షాకోట్‌లో మాజీ కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి...


బండ్లగూడ ధాత్రి కాలనీలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు


హైదర్‌గూడలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద భక్తులు


మణికొండలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


పుప్పాలగూడలో దుర్గామాత హోమం నిర్వహిస్తున్న భక్తులు


మణికొండ శివాలయంలో...

పెద్దతాళ్లకుంటలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి


పెద్దతాళ్లకుంట చెరువు వద్ద నిమజ్జనానికి వచ్చిన మహిళలు

అత్తాపూర్: పెద్దతాళ్లకుంట చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి నీరు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెరువును కుంటలను అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా బతుకమ్మ పండుగ నిమిత్తం ఆ చెరువులలో నీళ్లు ఉండేలా పూడికతీత కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టకపోవడంతో మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క ప్రాంతంలోనే బతుకమ్మలను నిమజ్జనం చేశారు. 11 రోజుల పాటు జరిగే బతుకమ్మ పండుగ వేడుకలను సాఫీగా నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేయాలని మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణపై కార్మికులు శ్రద్ధ చూపాలి

నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి


కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మణికొండ: నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే మున్సిపల్ కార్మికుల ఆరోగ్యాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వందలాది మంది కార్మికులు, సిబ్బందికి సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... రోజూ దుమ్ము, ధూళి, మురుగు నడుమే విధులు నిర్వర్తించే కార్మికుల ఆరోగ్యాలు సహజంగానే దెబ్బతింటాయన్నారు. అలాంటి వారికి తరచూ వైద్య పరీక్షలు, మందులు వాడాల్సిన అవసరం ఉంటుందన్నారు. అందుకు ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. మండల వైద్యాధికారి సత్యరత్న, సూపర్‌వైజర్ లక్ష్మీ, ఏఎన్ఎంలు తేజ, జయమ్మ, సానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం, సూపర్ వైజర్‌లు రాహుల్, వంశీ, రవి, జనార్దన్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్ రికార్డులను భద్రపర్చాలి'


డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మణికొండ: మణికొండ మున్సిపల్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చుతున్నందున అందులోని ముఖ్యమైన ఫైల్స్, ఓసీలు, ఇంజనీరింగ్ రికార్డులు, నిర్మాణ అనుమతులు, ఆస్తి పన్ను వివరాల రికార్డులను పటిష్టంగా భద్రపర్చాలని బీఆర్‌ఎస్ మణికొండ మున్సిపల్ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో పలువురు మున్సిపల్ శాఖ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌రావును కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ... మణికొండ ల్యాంకోహిల్స్ పక్కన నిర్మించిన నూతన భవనంలోకి మున్సిపల్ కార్యాలయంను తరలిస్తున్నట్టు సిబ్బంది చెప్పారన్నారు. అదే జరిగితే అందులోని రికార్డులు తారుమారయ్యే అవకాశం ఉందనే అనుమానంతో ఉన్నతాధికారులకు వాటిని భద్రపర్చమని కోరామన్నారు. మున్సిపాలిటీగా ఉన్నా జీహెచ్‌ఎంసీలో విలీనం అయినా ప్రస్తుత రికార్డులు కీలకం అన్నారు. నాయకులు కె. ధన్‌రాజ్, జి.నరేందర్, కిరణ్, శ్రీకాంత్, భానుచందర్, సుమ నళిని, విఠల్, బాబురావు, దస్తగిర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలి


చేపల దుకాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు


బండ్లగూడ: వ్యాపారులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ హిమాయత్‌సాగర్ జలాశయం సమీపంలో చేపల వ్యాపారుల దుకాణాలను కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఎల్లవేళలా వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జలమండలి డీజీఎం గోవింద్‌గౌడ్, అంతారం నరేష్, హరీష్‌గౌడ్, చేపల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో నాయకత్వ లక్షణాలు


మాట్లాడుతున్న కార్యదర్శి అనఘా వెంకటలక్ష్మి

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలో రాష్ట్ర స్థాయిలో శిశు మందిర విద్యార్థులకు కళాత్మక, రంగ్ మంచ్, ఘోష శిక్షణ కార్యక్రమాలను శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి అనఘా వెంకటలక్ష్మి మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శిక్షణ ద్వారా ప్రతి ఒక్కరిలో ఉన్న శక్తులు వెలికితీసే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరిలో కూడా నైపుణ్యత, సృజనాత్మకత శక్తులు ఉన్నాయన్నారు. నాయకత్వ లక్షణాలు, జట్టు నిర్మాణం అవుతాయన్నారు. చక్కటి క్రమ శిక్షణ అందరిలో కలిసి ఉండటం లాంటి మంచి లక్షణాలు అలవడతాయన్నారు. సరస్వతీ విద్యా పీఠం ప్రాంత ఉపాధ్యక్షులు పసర్తి మల్లయ్య, ప్రాంత శైక్షణిక్ ప్రముఖ్ కృష్ణమాచార్యులు, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపిక



మైలార్‌దేవ్‌పల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ పోటీలలో మహవీర్ మార్షల్ ఆర్ట్స్ విషూ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. ఎంపికైన వారిలో అండర్–17 విభాగంలో పూల ప్రణయ్ (45 కేజీలు), టి.చరణ్ (56 కేజీలు), ఎ.కార్తీక్ (65 కేజీలు), జి.శ్రీశాంత్ (60 కేజీలు), అండర్–19 విభాగంలో వి.భారత్ (48 కేజీలు), ఎ.జయవర్ధన్ (56 కేజీలు), బి.సాయికృష్ణయాద్ (90 కేజీలు), కె.సాయిచరణ్ (60 కేజీలు)ల విభాగంలో పోటీపడతారని వివరించారు. కార్యక్రమంలో కోచ్ ఎం.సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంత ఏర్పాటుపై స్థానికుల అభ్యంతరం

పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన వ్యాపారులు


ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి వెళ్లిన వ్యాపారస్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జన చైతన్య ఫేజ్–2 రోడ్డు నంబర్–10లో కూరగాయల వారాంతపు సంతను ఏర్పాటు చేయడాన్ని స్థానికులు అడ్డుకుంటున్నారని వ్యాపారస్తులు సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కూరగాయల వ్యాపారస్తులు విజయ, పూర్ణిమ, రెహమాన్, ఖుష్బూలు మాట్లాడుతూ... మూడేళ్లుగా కాలనీలో వారాంతపు సంతను కొనసాగిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ సంత కొనసాగుతుందన్నారు. వ్యాపారం పూర్తయిన అనంతరం తామే రోడ్లను ఊడ్చి శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. కానీ కొందరు కాలనీవాసులు తమ వ్యాపారాన్ని అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం మధ్యాహ్నం తాము వ్యాపారం చేసుకునేందుకు వెళ్లగా దుకాణాలను ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారన్నారు. ఇదే విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. సోమవారం కష్టపడి డబ్బును పోగు చేసి కూరగాయలను కొనుగోలు చేశామని.. విక్రయించేందుకు అడ్డుకోవడంతో పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు.

26న బతుకమ్మ సంబరాలు

రాజేంద్రనగర్: దసరా పండుగ సందర్భంగా ఈ నెల 26వ తేదీన రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ బతుకమ్మ సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, అత్తాపూర్ డివిజన్లకు చెందిన మహిళా సంఘాలతో పాటు కాలనీ, బస్తీ, సంక్షేమ సంఘం మహిళలకు ఈ బతుకమ్మ సంబరాలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ ఏడాది మరింత పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం


అరెస్టు చేసిన బైక్ దొంగలతో శంషాబాద్ పోలీసులు

శంషాబాద్ రూరల్: రెండు వేర్వేరు ఘటనల్లో బైక్ దొంగలను శంషాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... మండలంలోని పాల్మాకులలో సారా రాకేష్, కాచారంలో రాజు ఇంటి ముందు నిలిపిన బైక్‌లను ఈ నెల 19న గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులకు ముగ్గురు బైక్ దొంగలు పట్టుపడ్డారు. మియాపూర్‌లో నివాసముండే సంతోష్‌దాస్ అలియాస్ కుమార్, రాఘవేంద్ర అలియాస్ పండు కలిసి పాల్మాకులలో బైక్‌ను దొంగిలించారు. కాచారంలో అదే గ్రామానికి చెందిన మైలారం శివకుమార్ ఈ బైక్‌ను దొంగిలించారు. వీరు గతంలో ఇతర ప్రాంతాల్లో కూడా బైక్‌లను దొంగిలించినట్లు విచారణలో తేలింది. వీరు దొంగిలించిన 5 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వీరిని కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసు విచారణలో ప్రతిభ ఎస్ఐ నర్సింహ నాయక్, సిబ్బంది విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌రెడ్డిని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి, డీఐ పవన్‌కుమార్ అభినందించారు.

హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శ్రీనాథ్‌గౌడ్



రాయదుర్గం: హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శ్రీనాథ్‌గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనాథ్‌గౌడ్ ఇప్పటి వరకు నల్గొండ డిపో మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. సోమవారం విధుల్లో చేరిన ఆయనకు డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇతర అధికారులు, ఉద్యోగులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనాథ్‌గౌడ్ మాట్లాడుతూ డిపో అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

నవోదయ దరఖాస్తు గడువుతేదీ పెంపు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయాలలో 9వ తరగతి, 11వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు తేదీని పెంచినట్లు గోపన్‌పల్లి జేఎన్‌వి రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ విజయభాస్కర్ సోమవారం తెలిపారు. 2026–27 విద్యాసంవత్సరంలో ఆయా తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తులను ఉచితంగా ఆన్‌లైన్ ద్వారా పొందాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారి ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

హానర్ అక్వాంటీస్‌కు అవార్డులు

రాయదుర్గం: గ్రాండ్ గణేష్ అవార్డ్స్–2025 సీజనల్–6లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గోపన్‌పల్లిలోని హానర్ అక్వాంటీస్ అపార్ట్‌మెంట్ పలు అవార్డులను సాధించింది. గణేష్ ఉత్సవాల నిర్వహణను పరిశీలించి మూడు కేటగిరిలలో అవార్డులను అందించారు. ముఖ్యంగా యువశక్తి, డిజిటల్ స్టోరీ టెల్లింగ్, ఇన్‌క్లూజివ్ లివింగ్ అవార్డుల కేటగిరిలలో అవార్డులు అందించారు. అంతేకాకుండా 'తేజస్విని నారి' సొసైటీ స్పెషల్ జ్యూరీ అవార్డును కూడా అందించారు. ఈ అవార్డులను హానర్ అక్వాంటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు స్వీకరించారు.

బాధ్యతల స్వీకరణ


చైర్మన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్‌లోని శ్రీ వాసవి ఆర్య వైశ్య పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం చైర్మన్‌గా డాక్టర్ అనంతంగుప్తా బాధ్యతలు స్వీకరించారు. మాజీ చైర్మన్ సోమా శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ చేడం వెంకటరమణగుప్తా, కోశాధికారి బచ్చు అంజయ్య గుప్తాలతో పాటు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓరుగంటి భద్రయ్యగుప్తా, సంఘం మాజీ అధ్యక్షులు రంగాప్రభాకర్ గుప్తా, ఉరే శ్రీనివాస్‌గుప్తా, అర్థం లక్ష్మయ్య గుప్తా, వీరబొమ్మ సురేష్‌గుప్తా, సిరంగి బుచ్చయ్యగుప్తా, కుంచకూరి పుల్లయ్యగుప్తా, డైరెక్టర్స్ సోమ అశోక్‌గుప్తా, గంగోలి వెంకటేష్, చెవ్వ వెంకటకృష్ణ, పానుగంటి శేఖర్‌గుప్తా, ఉప్పల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- శంషాబాద్ మున్సిపాలిటీలో లబ్ధిదారులు 534
- వివిధ కారణాలతో రద్దైన ఇళ్లు 194
- మొదటి బిల్లు పొందిన లబ్ధిదారులు 267


శంషాబాద్ పట్టణంలోని చిన్నగొల్కొండ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం


ఘాంసిమియాగూడలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. వివిధ కారణాలతో 194 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి దూరమయ్యారు. ముగ్గులు వేసి పనులు ప్రారంభించిన ఇళ్ల నిర్మాణ పనులు మాత్రం శరవేగంగా జరుగుతున్నాయి. ఇళ్ల కోసం దరఖాస్తులు వచ్చిన వాటిలో వివిధ రకాల వడపోతల అనంతరం మొత్తం 534 మందిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

కారణాలు ఇవీ...

శంషాబాద్ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించిన జాబితా తర్వాత కూడా భూ సంబంధిత సమస్యలు నిర్మాణాలకు భారీగా అడ్డంకులుగా మారుతున్నాయి. కుటుంబ వివాదాల్లో భూములు కొన్ని కాగా కొందరు లబ్ధిదారులు 400 ఎస్ఎఫ్‌టీలకు తక్కువగా స్థలం ఉండటం మరికొందరు 600 మించి ఎస్ఎఫ్‌టీలకు మించి ఉన్న కారణంగా కూడా వాటి నిర్మాణాలను పక్కన పెట్టేశారు. దీనికి తోడు కొందరు నిర్మాణాలకు స్వయంగా విముఖత వ్యక్తం చేయడంతో మొత్తం 194 ఇళ్లు రద్దు అయినట్లు అధికారులు వెల్లడించారు.

పురోగతి ఇలా..

రద్దైన ఇళ్లు పోగా మిగతా ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పట్టణంలో ఇప్పటికే 267 మంది లబ్ధిదారులు మొదటి బిల్లును కూడా పొందారు. ఇక 59 నిర్మాణాలు ఇప్పటికే స్లాబ్ కూడా పూర్తయ్యాయి. మిగతా నిర్మాణాలు కొన్ని ముగ్గులు వేయడం, పునాది తీసే దశలో కొనసాగుతున్నాయి. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుతం కూడా అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకోసం దరఖాస్తుదారులు ప్రజాపాలన ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారి ఆర్థిక స్థితిగతులు అన్నింటిని హౌసింగ్ అధికారులు పరిశీలన చేసిన అనంతరం మున్సిపాలిటీకి జాబితాను అందిస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవచ్చు

"అర్హులైన లబ్ధిదారులు ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టణంలో 194 ఇళ్లు వివిధ కారణాలతో రద్దయ్యాయి. కొందరు స్వయంగా విముఖత వ్యక్తం చేశారు. 60 శాతానికి పైగా లబ్ధిదారులు ఇప్పటికే మొదటి బిల్లును స్వీకరించారు. యాభైకి పైగా స్లాబ్ నిర్మాణాలు పూర్తయ్యాయి.

– బి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్, శంషాబాద్